మరీ ఇంత నిర్లక్ష్యమా?

- కాలువలు కబ్జా – డ్రైనేజీలు నిరుపయోగం
- ప్రభుత్వ కార్యాలయాల రక్షణ గోడలకు బీటలు
- స్పందించని అధికారులు.. కానరాని కార్పొరేటర్

కాలువల కబ్జా..
ఇండస్ట్రియల్ ఎస్టేట్ సూర్యనగర్‌లో ఉన్న జిల్లా ఉపాధి శిక్షణ కేంద్రం రక్షణ గోడలకు ఆనుకుని ఉన్న జీవీఎంసీ ప్రభుత్వ స్థలం, కాలువలు కబ్జాకు గురవుతున్నాయి. ఇక్కడి వాకర్స్ క్లబ్ సభ్యులు కూటమి నాయకులతో కలిసి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారు. కాలువలపై సిమెంట్ పలకలు వేసి భారీ కంటైనర్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ రోడ్లపై కార్ల షెడ్ నిర్మించడంలో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందని స్థానికులు వాపోతున్నారు. కబ్జాపై టౌన్ ప్లానింగ్ అధికారులను వివరణ అడిగితే ప్రజా ప్రతినిధుల ఒత్తిడి ఎక్కువగా ఉందని తెలిపారు.

శానిటరీ సిబ్బంది నిర్లక్ష్యం..
వార్డులో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో సచివాలయ శానిటరీ సెక్రటరీల పర్యవేక్షణలో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వార్డు ఇన్‌స్పెక్టర్‌ను నియమించకపోవడం, కార్పొరేటర్ అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంతో పారిశుద్ధ్యం అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. కంచరపాలెం పోలీస్ స్టేషన్ నుంచి ఐటీఐ కూడలి బీఆర్‌టీఎస్ రహదారికి వెళ్లే ప్రధాన డ్రైనేజీల్లో చెత్తా చెదారాలు, మట్టి, డెబ్రిస్ వేయడంతో మురుగు సక్రమంగా ప్రవహించడంలేదు. దీంతో ఈ ప్రాంతం దోమల విజృంభణతో స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు.


జీవీఎంసీ కాలువను ఆక్రమించి ఏర్పాటు చేసిన కంటైనర్


ప్రధాన రహదారిలో గెడ్డల దుస్థితి


డ్రైనేజీల్లో చెత్తా చెదారం

కంచరపాలెం: ఐటీఐ కూడలి పరిధిలో గల సంకుర పేట, సూర్యనగర్–1,2 భవానీగార్డెన్స్ యూపీహెచ్‌సీ, జిల్లా ఉపాధి కార్యాలయం, ప్రభుత్వ బాలికల శిక్షణ కేంద్రం పరిసరాలు అధ్వానంగా మారాయి. శానిటరీ సిబ్బంది ఇటు కన్నెత్తి చూసిన దాఖలాలు కనిపించడం లేదు. ఓపెన్ డ్రైనేజీలను నిర్లక్ష్యంగా వదిలేయడం, చెత్తా చెదారాలు డ్రైనేజీల్లో వేయడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. జిల్లా ఉపాధి కార్యాలయం ప్రధాన ద్వారం వంతెన అధ్వానంగా మారింది. రక్షణ గోడకు ఆనుకుని పచ్చికబయళ్లు ఏపుగా పెరిగాయి. విష కీటకాలు సంచారం ఎక్కువగా ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

రక్షణగోడలు శిథిలం..
ఉపాధి–శిక్షణ శాఖ ప్రాంతీయ జోన్–1 ఉప సంచాలకుల కార్యాలయం, జిల్లా ఉపాధి కార్యాలయం, ప్రభుత్వ పారిశ్రామిక బాలికల శిక్షణ కేంద్రం రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రధాన ద్వారాలు ప్రమాదభరితంగా మారాయి. రక్షణ గోడలు బీటలు వారాయి. అటుగా రాకపోకలు సాగించే ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు సమస్యలపై స్పందించి ప్రమాదభరితంగా మారిన రక్షణ గోడలను పునర్నిర్మించాలని కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే బెదిరిస్తున్నారు..



స్థానిక సమస్యలపై జోన్–5 జోనల్ కార్యాలయంలో ఆయా విభాగాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. కబ్జాలపై ఫిర్యాదు చేస్తే బెదిరింపులు వస్తున్నాయి. ప్రజలకు రక్షణ లేకుండా పోయింది. సంబంధిత అధికారులు స్పందించకపోతే ఇక్కడి సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.
– ఎ.లోకేష్, స్థానికుడు, ఐటీఐ జంక్షన్


ఆక్రమణలతో కుదించుకుపోతున్న కంచరపాలెం పోలీస్‌స్టేషన్ నుంచి ఐటీఐకి వెళ్లే రహదారి


ఉపాధి కార్యాలయంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న రక్షణగోడ.. సైన్‌బోర్డు

క్లుప్తంగా

జెడ్సీ దృష్టికి పలు సమస్యలు


వివరాలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ రాము

మర్రిపాలెం: జీవీఎంసీ జోన్–5 కమిషనర్ బి.రాము 51వ వార్డులో పర్యటించారు. ఈ మేరకు మంగళవారం ఆయన మహత్‌కాలనీ, భీమ్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి వార్డులో నెలకొన్న డ్రైనేజీ, కొండవాలు ప్రాంతంలో మెట్లు, మంచినీరు, వీధిలైట్ల సమస్యలను స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఎస్‌బీఐ ఖాతాదారులకు ఉచిత వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది


సీతమ్మధార: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారకానగర్ బ్రాంచ్‌లో మంగళవారం ఖాతాదారులకు బ్యాంకు ఆవరణలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వి హెల్త్ కేర్, వి డెంటల్ ఆస్పత్రులు సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో బీపీ, షుగర్, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్యాంక్ కస్టమర్ల నుండి శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 150 మంది వైద్య పరీక్షలు చేయించుకుని తమ ఆరోగ్యం పట్ల అవగాహన పొందారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ ఎన్. దుర్గాప్రసాద్ శిబిరాన్ని పర్యవేక్షించారు. డాక్టర్ వి. స్వర్ణలత, వి హెల్త్ కేర్ డైరెక్టర్ కేఎంకే రమేష్, క్లినిక్ హెడ్ సీహెచ్ కృష్ణ, వైద్య బృందం లతీష, తులసి, లిఖిత్ తదితరులు సేవలందించారు.

క్యాబ్ యజమాని దాడిపై కేసు నమోదు


ఫోర్తుటౌన్ ఎదుట ధర్నా చేస్తున్న డ్రైవర్లు

సీతమ్మధార: తను పనిచేసే క్యాబ్ యజమాని, అతని స్నేహితుడు తనపై దాడి చేశారంటూ క్యాబ్ డ్రైవర్ ఆశి గంగాధర్ ఫిర్యాదు చేయడంతో ఫోర్త్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై క్యాబ్ డ్రైవర్లతో కలిసి మంగళవారం రాత్రి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు.బాధితుడు గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం, యజమాని విజయ్ సూచన మేరకు ఈనెల 12న శ్రీకాకుళం వెళ్లి అక్కడ ప్రయాణికులను ఎక్కించుకుని విజయవాడలో దింపి తిరిగి విశాఖ చేరుకున్నాడు. శ్రీకాకుళం నుంచి విజయవాడకు రూ.12వేలకు బేరం కుదుర్చుకోవడంతో ఆ డబ్బులను డ్రైవర్ యజమానికి ఇచ్చాడు. అయితే కారు కిలోమీటర్లు తగ్గాయని యజమాని ప్రశ్నించాడు. తెలియదని డ్రైవర్ గంగాధర్ చెప్పడంతో ఆగ్రహించిన విజయ్, అతని స్నేహితుడు సురేష్ కలిసి కేబుల్ తీగతో విచక్షణారహితంగా కొట్టడంతో గంగాధర్‌కు గాయాలయ్యాయి. ఘటనపై సీఐ ఎ.సత్యనారాయణ ఇద్దరి నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

సీతమ్మధార: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. ఫోర్త్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు...పోర్ట్ హాస్పిటల్ సమీపంలోని అబిద్ నగర్‌లో ఈనెల 13న ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడు వివరాలు తెలిస్తే సంప్రదించాలని పోలీసులు కోరారు.

రోజూ ట్రాఫిక్ జామ్


రోడ్డుపై ఇష్టానుసారంగా వాహనాలు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధిలోని 14వ వార్డులో గల ఎస్ఎఫ్ఎస్ పాఠశాల వద్ద ప్రతిరోజూ తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పాఠశాల ప్రారంభ సమయానికి ముందు, అలాగే పాఠశాల ముగిసిన తర్వాత విద్యార్థులను తీసుకువెళ్లేందుకు వచ్చే వాహనాలను పాఠశాల గేట్ల వద్ద ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌సమస్య ఏర్పడుతోంది. నార్త్ ఎక్స్‌టెన్షన్ పాఠశాల నుంచి బాలయ్యశాస్త్రి లేఅవుట్ వైపు వెళ్లే ప్రధాన మార్గంలో కార్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు యథేచ్ఛగా నిలుపుదల చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పాఠశాలను ఆనుకుని ఉన్న రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరి ఉంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పాఠశాల ఆవరణలో విశాలమైన మైదానం ఉన్నప్పటికీ, వాహనాలను లోపలికి అనుమతించకపోవడం వల్ల రోడ్డుపై ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదని పలువురు పేర్కొంటున్నారు. వాహనాలను పాఠశాల మైదానం వరకు అనుమతిస్తే ట్రాఫిక్ కష్టాలు తప్పుతాయని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆహార కల్తీకి పాల్పడే వారిపై చర్యలకు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మండల్ ప్రతినిధి ప్రియాంక దండి తదితరులు

మహారాణిపేట: ఆహార కల్తీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాయి వంజి బాబా గ్రామీణ వికాస్ మండల్ నగర కార్యదర్శి కాండవ గాయిత్రి కోరారు. మంగళవారం మండల్ ప్రతినిధి బృందం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ఆహార భద్రత, ప్రమాణాల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మండలికి చెందిన ప్రియాంక దండి, దీప్తి, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

రోడ్డును ఆక్రమించి భవన నిర్మాణ పనులు


24వ వార్డు నక్కవానిపాలెం రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి

సీతమ్మధార : పక్కవాడు ఎలా పోతే నాకేంటి... నా పనులు అయితే చాలు అన్న చందంగా వ్యవహరించాడు ఓ ఇంటి యజమాని. జీవీఎంసీ పరిధిలోని 24వ వార్డు, నక్కవానిపాలెం రోడ్డులో తన స్వార్థం కోసం ఏకంగా రోడ్డును మూసివేసి కాంక్రీట్ పనులు నిర్వహించాడు. భవన నిర్మాణ యజమానులు ఇష్టారాజ్యంగా రోడ్డుకు అడ్డంగా ఇసుక, పిక్క వేయడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో ఆ రోడ్డులో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీనిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొన్నా పోలీసులు, జీవీఎంసీ జోన్–3, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, అంతేకాదు సచివాలయం సెక్రటరీలు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. తమ పనులు పూర్తి చేసుకోవడానికి రోడ్లను అడ్డంగా మూసివేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. సామాన్య ప్రజల ఇబ్బందులను ఏ మాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నిందితుల కోసం నాలుగు బృందాలతో గాలింపు

సీతమ్మధార: అబిద్‌నగర్ పార్కులో ఆవాల నరసింహారావుపై జరిగిన హత్యాయత్నం కేసులో పోలీసులు సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. ఫోర్త్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం, నరసింహారావు ఈనెల 11వ తేదీ రాత్రి 5.55 గంటలకు నర్సింహనగర్‌లోని ఓ బార్‌లో మద్యం సేవించి బయటకు వచ్చాడు. 5.58కి ఆటో స్టాండ్ వద్ద కొంతసేపు ఉండి, అక్కడి నుంచి రాత్రి 9.10కి అబిద్‌నగర్ పార్కులోకి ప్రవేశించాడు. తిరిగి 12.09 గంటలకు బయటకు వచ్చాడు. ఈ క్రమంలోనే నరసింహారావుపై దాడి జరిగింది. నరసింహారావు కిందపడిపోయి ఉండడాన్ని ఆటో డ్రైవర్ రియాజుద్దీన్ చూసి 1.10 గంటలకు 112 నంబర్‌కు ఫోన్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని కేజీహెచ్‌కు తరలించారు. నిందితుల కోసం నాలుగు బృందాలతో గాలిస్తున్నట్టు సీఐ సత్యనారాయణ చెప్పారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్తున్న అవర్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

కంచరపాలెం: జ్ఞానాపురం రైల్వేస్టేషన్ రహదారిలో భిక్షాటన చేసుకునే అనాథ వృద్ధుడు (70) మంగళవారం మరణించాడు. స్థానికులు కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అవర్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు ముందుకు వచ్చి మృతదేహానికి కాన్వెంట్ కూడలి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవర్ హ్యాండ్స్ అధ్యక్షుడు పిల్లి గోవిందరాజు, ఐతి మధుబాబు, రవికుమార్, శివ, హెడ్ కానిస్టేబుల్ వి.వెంకట్రావ్, మొబైల్ కానిస్టేబుల్ రాంబాబు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలకు హద్దే లేదు

27వ వార్డులో ఇష్టారాజ్యంగా షెడ్డు ఏర్పాటు


ద్వారకానగర్ 6వ లైన్‌లో అక్రమ షెడ్డు

సీతమ్మధార: నడిరోడ్డుపై అక్రమంగా షెడ్డు నిర్మిస్తున్నా అధికారులకు పట్టడం లేదు. పైగా దానికి అసెస్‌మెంట్ నంబర్ నుంచి విద్యుత్ కలెక్షన్ వరకు అన్నీ క్షణాల్లో మంజూరు చేసేయడం గమనార్హం. జీవీఎంసీ 27వ వార్డు ద్వారకానగర్ 6వ లైన్, భగత్‌సింగ్ కాలనీలో సచివాలయం పక్కనే అక్రమ నిర్మాణం చేపట్టినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ అక్రమ నిర్మాణానికి స్థానిక టౌన్‌ప్లానింగ్ అధికారులు, సచివాలయ సెక్రటరీలే సహాయ సహకారాలు అందిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. శుక్రవారం రాత్రి మొదలు పెట్టిన షెడ్డు నిర్మాణం ఆదివారం నాటికి పూర్తి చేసేశారు. దానికి బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. అలాగే షెడ్డుకు 47-1-92 డోర్ నంబర్, 1086121516 అసెస్‌మెంట్ నంబర్, 130ఎ041171356 నంబర్‌తో ఎలక్ట్రికల్ కనెక్షన్ సైతం మంజూరు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలోని రోడ్ల మీదే అక్రమ నిర్మాణాలు, బడ్డీలు ఇష్టానుసారంగా వెలుస్తున్నాయి. రోడ్డు పక్కనే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోకపోగా.. వాటికి వంత పాడుతుండడం విశేషం.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆదేశాల మేరకు, జీఆర్పీ ఎస్ఐ కే శాంతారాం, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.శివనారాయణ తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రాష్ట్రం పాడువకు చెందిన బసంత కుమార్ ఖరా గంజాయిని అక్రమంగా తరలిస్తుండడాన్ని గుర్తించారు. బసంత్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

రైల్వే ప్రైవేటీకరణ తగదు


సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిటు నాయకులు

డాబాగార్డెన్స్: రైల్వే ప్రైవేటీకరణ యోచనను విడనాడాలని, భద్రతా ప్రమాణాలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 19న అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం సిటు కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, పలువురు నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ సదస్సుకు ముఖ్య వక్తగా సిటు అఖిల భారత అధ్యక్షురాలు కె. హేమలత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, రైల్వే యూనియన్ నాయకులు ఉమామహేశ్వరరావు, ఇతర ఫెడరేషన్ నాయకులు హాజరవుతారని తెలిపారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజల సంపదైన రైల్వేలను పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం ప్రైవేటీకరించే విధానాలను దూకుడుగా అమలు చేస్తోందన్నారు. ప్రైవేటీకరణ వల్ల నాణ్యత తగ్గిపోతుందన్నారు. సదస్సులో పెద్ద ఎత్తున ఉద్యోగులు, కార్మిక సంఘాలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్. జ్యోతీశ్వరరావు, ఈస్ట్‌కోస్ట్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి. జగన్ తదితరులు పాల్గొన్నారు.

పరదేశమ్మ ఆలయాభివృద్ధికి రూ. 50 వేల విరాళం


పరదేశమ్మ ఆలయాభివృద్ధికి రూ. 50 వేల నగదు అందజేస్తున్న శివగణేష్

తాటిచెట్లపాలెం: రైల్వేన్యూకాలనీ, తాటిచెట్లపాలెం పరిసర ప్రాంతాల్లో వెలసిన పరదేశమ్మ ఆలయంలో అభివృద్ధి పనులకు గాను కృష్ణవేణి బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత, ఏపీఐఐసీ మాజీ స్టేట్ డైరెక్టర్ ఆళ్ల శివగణేష్ రూ. 50 వేలు ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఆలయంలో గల అమ్మవారి విగ్రహానికి సంబంధించిన ఏనుగులకు ఒక కేజీ వెండి తాపడం చేయించేందుకు గాను ఈ నగదును అడ్వాన్స్‌గా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు దాడి శ్రీనివాసరావు, కార్యదర్శి సన్యాసిరావు, కాశీప్రసాద్, సదరం ఆంజనేయులు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కవి సమ్మేళనానికి ఆహ్వానం


ధర్మారావు

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ధర్మారావుకు ప్రతిష్టాత్మక ఆహ్వానం లభించింది. వచ్చే నెల 8న హైదరాబాదులోని త్యాగరాజ గాన సభలో తెలుగు భాషా చైతన్య సమితి నిర్వహించనున్న 'తెలుగు భాషకు పట్టాభిషేకం' అంతర్జాతీయ కవిసమ్మేళనంలో కవితాగానం చేసేందుకు ఆయనను ఆహ్వానించారు. ఈ మేరకు తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్ ఆహ్వాన పత్రికను పంపినట్లు ధర్మారావు తెలిపారు. తెలుగు భాషా చైతన్య సమితి 12వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అంతర్జాతీయ కవి సమ్మేళనంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందుకున్న ధర్మారావును పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనరస, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

అనూష భర్తను కఠినంగా శిక్షించాలి

మహారాణిపేట: మధురవాడకు చెందిన నిండు గర్భిణి అనూషను కడతేర్చిన భర్తను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అత్తిలి విమల డిమాండ్ చేశారు. మంగళవారం కేజీహెచ్ మార్చురీ వద్ద సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. హోమ్ మంత్రి అనిత ఈ ఘటనపై స్పందించకపోవడం దారుణమని, సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టి మహిళలకు రక్షణ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి, కార్యదర్శి ఎం.డి బేగం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన


హక్కులపై అవగాహన కల్పిస్తున్న హ్యూమన్ రైట్స్ సంస్థ ప్రతినిధులు

సీతంపేట: కేవీఆర్ ఫౌండేషన్, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వివిధ చట్టాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉపకార్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు ముఖ్య అతిథిగా పాల్గొని హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. వృద్ధులు, వికలాంగులు, మతిస్థిమితం లేని వారు, యాచకులు, పేదవారికి సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొడ్డపాటి దాసు, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కనపర్తి ఇందిరా ప్రియదర్శిని, నేషనల్ కన్వీనర్ శశిరేఖ, ఈసీ మెంబర్ ఎస్.ఝాన్సీ, కన్జూమర్ ఫౌండేషన్ చైర్మన్ మర్రి సత్యనారాయణ తదితరులు హక్కులపై అవగాహన కల్పించారు.